సాక్షి
కుమురం భీం
శనివారం । 17 । ఆగస్టు । 2024

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతానికి మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి వేణుగోపాల్‌, సభ్యులు సంతోష్‌, మాతృ భారతి సభ్యురాలు ఖాండ్రె దుర్గ, కల్లూరి వైష్ణవి, ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావ్‌ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్‌

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్‌: విదేశీ విద్యాలయాల్లో 2024– 25 విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యనభ్యసించేందుకు షెడ్యూల్డ్‌ కులాలకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ అధికారి సజీవన్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్‌ ఓవర్‌సీస్‌ విద్యానిధి(ఏఓవీఎన్‌) పథకం కింద ఉపకార వేతనాలు అందిస్తుందని తెలిపారు. ఈ నెల 14 నుంచి అక్టోబర్‌ 13 వరకు https://telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

ఆసిఫాబాద్‌: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో రైతులకు రూ.2లక్షల రైతు రుణమాఫీ అమలు చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంబేడ్కర్‌ చౌక్‌ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌ మాట్లాడారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మాజీ మంత్రి కేటీఆర్‌ మహిళలపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కేటీఆర్‌ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు నిజాం, జక్కన్న, సత్తన్న, శంకర్‌ పటేల్‌, మారుతి పటేల్‌, బాలేశ్‌, ఆరిఫ్‌ అలీ, తానాజీ పాల్గొన్నా రు.

ర్యాలీలో ఎమ్మెల్యేకు అస్వస్థత



కోవ లక్ష్మిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఆసిఫాబాద్‌అర్బన్‌: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సాయిబాబా ఆలయం నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల వరకు కొనసాగిన యాత్రలో ఎమ్మెల్యే ప్రజలతో కలిసి పాల్గొన్నారు. అంబేద్కర్‌చౌక్‌ వద్దకు చేరుకోగానే కళ్లు తిరుగుతున్నాయంటూ చౌరస్తాలోని ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ వద్దనున్న గద్దెపై కూర్చున్నారు. వెంటనే అందుబాటులో ఉన్న వైద్యుడిని పిలిపించి పరీక్షలు చేయించారు. ఎమ్మెల్యే ఆరోగ్యం కుదుటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రాఖీ స్టాల్స్‌ ఏర్పాటుకు అవకాశం

ఆసిఫాబాద్‌అర్బన్‌: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్‌ స్టేషన్‌లోని గదుల్లో అద్దె ప్రాతిపదికపై రాఖీ స్టాల్స్‌ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్‌ విశ్వనాథ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు స్టాల్స్‌ ఏర్పాటు చేసుకునేందుకు డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్‌: టీజీబీసీ ఎంప్లాయిబిలిటీ స్కిల్‌ డెవలప్‌మెంట్‌, ట్రైనింగ్‌ సెంటర్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో వందమంది బీసీ నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్‌ జిల్లా అధికారి సజీవన్‌ తెలిపారు. ఎల్‌జీ హూప్‌ టెక్నికల్‌ స్కిల్‌ అకాడమీ, ఎస్‌ఎస్‌ఐసీ ఎల్రక్టానిక్‌ కాంప్లెక్స్‌, కుషాయిగుడా, ఈసీఐఎల్‌ మెయిన్‌రోడ్డు, ఏషియన్‌ రాధిక మల్టీప్లెక్స్‌, కమలానగర్‌, కాప్రా– హైదరాబాద్‌ సౌజన్యంతో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణలో ప్రతీనెల అభ్యర్థికి రూ.4వేలతోపాటు భోజనం, స్టడీ మెటీరియల్‌, బేసిక్‌ టూల్‌ కిట్‌, టీషర్ట్‌ అందిస్తామన్నారు. టెన్త్‌, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్‌, ఒకేషనల్‌ విద్యార్హతతో 18 నుంచి 25 ఏళ్లు, రూ.5లక్షలకు మించకుండా వార్షిక ఆదాయం ఉండాలని తెలిపారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. 90 రోజుల వ్యవధితో కోర్సు ఉంటుందని, ధ్రువపత్రాలు అందించి ప్లేస్‌మెంట్‌ కల్పిస్తామన్నారు. ఈ నెల 24లోగా https://tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

ఎట్టకేలకు ముందడుగు..!

- ఉచిత చేపపిల్లల పంపిణీకి క్లియరెన్స్‌
- టెండర్ల ఆహ్వానం.. నాలుగు బిడ్లు దాఖలు
- ఈ నెలాఖరులోగా పరిశీలన
- వచ్చేనెల మొదటివారంలో చేపపిల్లల విడుదలకు చర్యలు



కుమురంభీం జలాశయంలో చేపపిల్లలు విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు(ఫైల్‌)

ఆసిఫాబాద్‌: ఆగుతూ.. సాగుతున్న ఉచిత చేపపిల్లల పంపిణీలో ఎట్టకేలకు ముందడుగు పడింది. ఏటా జూన్‌లోనే నిర్వహించాల్సి టెండర్ల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యం కావడంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఇటీవల అధికారులు టెండర్లు ఆహ్వానించగా.. నాలుగు బిడ్లు దాఖలయ్యాయి. ఇక ప్రక్రియ వేగవంతం కానుంది. జిల్లాలో కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టుతోపాటు 281 చెరువులు ఉన్నాయి. వీటిల్లో 1.45 కోట్ల చేపపిల్లలు వదిలేందుకు నలుగురు కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు చేశారు. టెండర్లు వేసిన వ్యాపారుల అర్హతలు, ధ్రువీకరణ పత్రాలు తదితర వివరాలను జిల్లాస్థాయి అధికారులు ఈ నెలాఖరులోగా పరిశీలించనున్నారు. ఇందుకోసం మత్స్య, రెవెన్యూ, పశు సంవర్ధకశాఖకు చెందిన ముగ్గురు అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఒక జిల్లాకు చెందిన కమిటీ మరో జిల్లాలో టెండర్లు, వ్యాపారుల వివరాలను పరిశీలించనున్నారు.

సెప్టెంబర్‌ మొదటి వారంలో విడుదల

సాధారణంగా మే, జూన్‌లో టెండర్లు ఆహ్వానిస్తే జూలైలో జలశయాలు నిండిన తర్వాత చేపపిల్లలు విడుదల చేసేవారు. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్‌ అమలులో ఉండటం, ఇతర అనివార్య కారణాలతో ప్రక్రియ ఆలస్యమైంది. రాష్ట్రంలోని కొన్నిజిల్లాలో ఇప్పటికే మత్స్యశాఖ ఆధ్వర్యంలో విత్తన చేపపిల్లల కొనుగోలుకు ప్రత్యామ్నాయంగా ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం టెండర్‌ ప్రకియ పూర్తికాగానే సెప్టెంబర్‌ మొదటి వారంలో చేపపిల్లలు జలశయాల్లోకి వదలనున్నారు.

మత్స్యకారులకు ఉపాధి

మత్స్యకారులకు ఉపాధి కల్పించి వారికి ఆర్థిక చేయూతనివ్వాలనే ఉద్దేశంలో గత ప్రభుత్వం 2016లో ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. జిల్లాలో 60 మత్స్యకారుల సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 5,000 మంది మత్స్యకారులు సభ్యులుగా కొనసాగుతున్నారు. మత్స్యశాఖ ద్వారా సభ్యులకు చేపల పెంపకానికి అవసరమైన సామగ్రిని రాయితీపై అందిస్తున్నారు. అలాగే జలాశయాల్లో పెంచేందుకు ఉచితంగా చేపపిల్లల పంపిణీ చేస్తున్నారు. కుమురంభీం, వట్టివాగు, పీపీరావు, ఎన్టీఆర్‌ సాగర్‌ ప్రాజెక్టులు, పది పెద్ద చెరువులు, తదితర చిన్నచెరువుల్లో ఏటా టెండర్‌ ప్రక్రియ అనంతరం చేపపిల్లలు విడుదల చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా చేప పిల్లల పంపిణీ ప్రారంభిస్తారు. 2022లో 1,35,81,000 చేప పిల్లలు, 2023లో 1,38,51,000 చేపపిల్లలు పంపిణీ చేశారు. జలాశయాల్లో వదిలిన చేపపిల్లలు ఎనిమిది నెలల్లో అర కిలో నుంచి ముప్పావు కిలో వరకు పెరుగుతాయి. మత్స్యకారులు ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌, మంచిర్యాల పట్టణాలతోపాటు మహారాష్ట్రలోని చంద్రపూర్‌, బల్లార్షా ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతున్నారు.

నాణ్యమైన చేపపిల్లలు విడుదల

ఉచిత చేపపిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్ల వివరాలు కమిటీల ద్వారా పరిశీలిస్తాం. తక్కువ రేటు వేసిన వారిని ఎంపిక చేస్తాం. సెప్టెంబర్‌ మొదటి వారంలో నాణ్యమైన చేపపిల్లల విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం.

– సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

మత్స్యకారులకు ఉపాధి



చెరువుల్లో ఉచితంగా చేపలు వదలడం ద్వారా మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది. ఈ ఏడాది పంపిణీ ప్రక్రియ ఆలస్యమైంది. చేపలు అనుకున్న సైజ్‌ పెరగడానికి ఇబ్బందులు ఎదురు కావొచ్చు. ఇప్పటికైనా నాణ్యమైన చేపపిల్లలు వదిలితే నష్టం తక్కువగా ఉంటుంది.

– గురుగుల లచ్చయ్య, మత్స్యకారుడు, ఆసిఫాబాద్‌

శుద్ధజలంతో వ్యాధులు దూరం

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే



కెరమెరి: అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

కెరమెరి(ఆసిఫాబాద్‌): శుద్ధజలం తాగడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. మండలంలోని ధనోరా మిషన్‌ భగీరథ పంప్‌ హౌజ్‌ను శుక్రవారం పరిశీలించారు. ధనోరా పరిధిలోని 970 ఆవాసాలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అంతర్గత రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు ఫాగింగ్‌ చేపట్టి, వీధుల్లో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లాలన్నారు. పంపుహౌజ్‌ డీఈ రాకేశ్‌, ఏఈ సాయికిరణ్‌, సిబ్బంది ఉన్నారు.

వైద్యసిబ్బందిని నియమిస్తాం

జైనూర్‌(ఆసిఫాబాద్‌): ఆస్పత్రుల్లో వైద్యసిబ్బందిని నియమించి సేవలు మెరుగుపరుస్తామని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జైనూర్‌ ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్‌ పరికరాలు ఉన్నా నిపుణులు లేక గర్భిణులు ఆదిలాబాద్‌ రిమ్స్‌కు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లారు. సరిపడా వైద్యులు లేరని, స్టాఫ్‌ నర్సుల కొరత ఉందని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు, విశ్వహిందూ పరిషత్‌ మండల అధ్యక్షుడు ఆత్రం భీంరావు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఆస్పత్రి ఆవరణలో కలెక్టర్‌ మొక్కలు నాటారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో తుకారాం, అదనపు వైద్యాధికారి సిద్ధార్థ్‌, మండల వైద్యాధికారి అశోక్‌ తదితరులు ఉన్నారు.

హిందూ సంఘాల బంద్‌ విజయవంతం



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, హిందూ సంఘాల నాయకులు



కాగజ్‌నగర్‌ పట్టణంలో నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, నాయకులు

- ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌ పట్టణాల్లో ర్యాలీ
- బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అరికట్టాలని డిమాండ్‌

ఆసిఫాబాద్‌అర్బన్‌/కాగజ్‌నగర్‌రూరల్‌: బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ వాహిని, జాగో హిందూ కమిటీ, ఇతర హిందూ సంఘాల పిలుపు మేరకు ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌ పట్టణాల్లో చేపట్టిన బంద్‌ విజయవంతమైంది. శుక్రవారం ఉదయం నుంచి మార్కెట్‌, దుకాణాలు మూసి ఉంచి వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌ పాటించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు సాయిబాబా ఆలయం నుంచి పాట్టి శ్రీరాములు చౌక్‌, కంచుకోట, బ్రాహ్మణవాడ గణేష్‌ మందిర్‌, రావులవాడ, గాంధీచౌక్‌, వివేకానందచౌక్‌, అంబేడ్కర్‌ చౌక్‌ల మీదుగా తిరిగి సాయిబాబా ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై మారణకాండను ఆపేందుకు ఐక్యరాజ్య సమితి చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్‌ చేశారు. బంద్‌ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ సదయ్య, సీఐ సతీశ్‌ ఆధ్వర్యంలో ఎస్సై రాజేశ్వర్‌, పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్‌, మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు బోనగిరి సతీశ్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్‌, మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌, జాగో హిందూ కమిటీ అధ్యక్షుడు ఆకుల సంతోష్‌, నాయకులు ఫయాజ్‌, మారుతి, జయరాజ్‌, రేగుంట కేశవ్‌రావు, ప్రణయ్‌, చేతన్‌, కృపాల్‌, ప్రమోద్‌, శంకర్‌, రమేశ్‌ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌ పట్టణంలో..

కాగజ్‌నగర్‌ పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లోని హిందువులు, జైనులు, క్రిస్టియన్లపై రెండు వారాలుగా దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని డిమాండ్‌ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొంగ సత్యనారాయణ, వీరభద్రచారి, భజరంగ్‌దళ్‌ జిల్లా అధ్యక్షుడు శివాగౌడ్‌, బీజేపీ పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్‌, నాయకులు రఘు ఠాకూర్‌, దెబ్బటి శ్రీనివాస్‌, కాళిదాస్‌ మజుందార్‌, మనోహర్‌గౌడ్‌, సమీర్‌గుప్తా, రాజేందర్‌ జంజోడ్‌, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో అక్రమాలు!

- రుణం తీసుకోకున్నా.. రుణమాఫీ జాబితాలో పేర్లు
- రెబ్బెన పీఏసీఎస్‌ సీఈవోను నిలదీసిన ఖాతాదారులు, నాయకులు



అధికారికి జాబితాలో పేరు చూపుతున్న సంజీవ్‌కుమార్‌ జైస్వాల్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ పథకం అర్హుల జాబితాతో రెబ్బెన ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం అక్రమాల బాగోతం బయటపడుతోంది. సహకార బ్యాంకు ఖాతాదారులకు తెలియకుండానే రూ.లక్షల్లో రుణాలు తీసుకున్నట్లు వెల్లడవుతోంది. గతంలో తీసుకున్న రుణాలు పూర్తిగా చెల్లించి నో డ్యూ సర్టిఫికెట్లు తీసుకున్న వారికి ఇంకా బ్యాంకులో రుణాలు ఉన్నట్లు చూపిస్తున్నాయి. రుణాలు తీసుకోకున్నా తమ పేర్లతో రుణాలు ఉండటంతో ఖాతాదారులు.. కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ కార్యాలయానికి చేరుకుని అక్రమాలపై సీఈవో సంతోష్‌ను నిలదీశారు.

అక్రమాలు ఇలా..

రెబ్బెన మండలం నంబాలకు చెందిన సంజీవ్‌కుమార్‌ జైస్వాల్‌ పేరు మీద ఆదిలాబాద్‌ డీసీసీబీ(ఆసిఫాబాద్‌ శాఖ)లో రూ.1,25,426 రుణం తీసుకున్నట్లు రుణమాఫీ జాబితాలో చూపిస్తోంది. అయితే సంజీవ్‌ జైస్వాల్‌ డీసీసీబీలో రుణమే తీసుకోలేదు. అదే గ్రామానికి చెందిన రత్నం వెంకటి అనే ఖాతాదారుడు గతంలో రూ.10వేల చిల్లర రుణం తీసుకోగా.. వడ్డీతో సహా గతంలోనే చెల్లించాడు. ఇప్పటికీ అతడి ఖాతాపై రూ.18వేల వరకు రుణం ఉన్నట్లు చూపిస్తోంది. రెబ్బెనకు చెందిన అజ్మీరా అశోక్‌ తన తండ్రి పేరు మీద రూ.5000 రుణం తీసుకోగా వడ్డీతో కలిసి రూ.5,600 చెల్లించి నో డ్యూ సర్టిఫికెట్‌ సైతం తీసుకున్నాడు. తర్వాత వేరే బ్యాంకులో రుణం తీసుకోగా.. ఇప్పటికీ డీసీసీబీలో రుణం ఉన్నట్లు చూపిస్తున్నారు. నంబాలకు చెందిన రంగు శ్రీనివాస్‌గౌడ్‌ సైతం గతంలో రూ.40వేల రుణం తీసుకోగా డిపాజిట్‌, షేర్‌ క్యాపిటల్‌ పేరుతో రూ.14వేలు బ్యాంకులోనే ఉంచుకుని మిగిలిన రూ.26వేలు ఖాతాదారుడికి అందించారు. అయితే వడ్డీతో సహా రుణం మొత్తాన్ని చెల్లించి ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ అతడి పేరుమీద రుణం ఉన్నట్లు మాఫీ జాబితాలో కనిపిస్తోంది.

అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

రెబ్బెన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రుణాలు తీసుకోకపోయినా తీసుకున్నట్లు చూపిస్తున్న ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌, డీసీసీవో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఖాతాదారుల ప్రమేయం లేకుండా వారి పేర్లతో రుణాలు మంజూరు చేసి సహకార బ్యాంకు సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. రుణాల పేరుతో రూ.కోట్ల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఖాతాదారుల లిస్టుతోపాటు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం రుణమాఫీ పథకాల్లో లబ్ధి పొందిన ఖాతాదారుల వివరాలు అందించాలని డిమాండ్‌ చేశారు. విషయాన్ని డీసీసీబీ అధికారులకు తెలియజేయడంతో ఉన్నతాధికారులు అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ అనంతలక్ష్మిని రెబ్బెన పీఏసీఎస్‌ కార్యాలయానికి పంపించారు. నాయకులు అడిగిన వివరాలు అందిస్తామని ఘటనపై విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. అయినా లిస్టు ఇచ్చేవరకు వెళ్లేది లేదని నాయకులు భీష్మించుకుని కూర్చోవడంతో రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్‌ పీఏసీఎస్‌కు చేరుకున్నారు. శనివారం విచారణ జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కాంగ్రెస్‌ పార్టీ నాయకులు రమేశ్‌, సుదర్శన్‌గౌడ్‌, చిరంజీవిగౌడ్‌, దేవాజీ, కిషన్‌గౌడ్‌, సురేందర్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్‌, వెంకటి, బీజేపీ నాయకులు కుందారపు బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి



గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి

- అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి

సిర్పూర్‌(టి): గురుకులాల విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రితోపాటు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, గురుకులాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య స్థితిగతులు తెలుసుకునేందుకు తరచూ వైద్యపరీక్షలు చేయించాలన్నారు. ఆస్పత్రిలో సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలందించాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలో వైద్యశిబిరాన్ని పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట డీపీవో భిక్షపతి, సామాజిక ఆస్పత్రి వైద్యాధికారి చెన్నకేశవ, తహసీల్దార్‌ శ్రీనివాస్‌, ఎంపీడీవో సత్యనారాయణ, లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నవత, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో 17.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

ఆసిఫాబాద్‌: జిల్లాలో రెండు రోజులుగా మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో వట్టివాగు, మొరం వాగు, పెద్దవాగులో ప్రవాహం పెరిగింది. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోత ఉండగా.. ఆ తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. తిర్యాణి మండలానికి భారీ వర్షసూచన ఉండగా వట్టివాగు పరీవాహక ప్రాంతాల ప్రజలను ప్రాజెక్టు అధికారులు అప్రమత్తం చేశారు. శుక్రవారం రాత్రి వట్టివాగు ప్రాజెక్టు 3, 4 గేట్లు 0.20 మీటర్ల ఎత్తి 720 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 17.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా, ఆసిఫాబాద్‌లో అత్యధికంగా 48.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జైనూర్‌లో 8.4మి.మీ.లు, సిర్పూర్‌–యూ 14.6, లింగాపూర్‌ 17.2, తిర్యాణి 42.6, రెబ్బెన 27.2, కెరమెరి 44.2, కాగజ్‌నగర్‌ 19.2, సిర్పూర్‌–టి 9.6, కౌటాల 5.2, చింతలమానెపల్లి 14.4, బెజ్జూర్‌ 1.6, పెంచికల్‌పేట్‌ 2.8, దహెగాం 13.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇటిక్యాల పహాడ్‌ గ్రామస్తులకు భూములు

- కేటాయించేందుకు అటవీశాఖ అంగీకారం
- భూముల కొలతలు పూర్తి చేసిన అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు, పోలీసులు, రావి శ్రీనివాస్‌

సిర్పూర్‌(టి): మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని సిర్పూర్‌(టి) మండలం ఇటిక్యాలపహాడ్‌ గ్రామంలో వివాదాస్పద భూముల సమస్య పరిష్కారం దిశగా సాగుతోంది. గ్రామస్తుల విన్నపం మేరకు ఒక్కో కుటుంబానికి భూమి కేటాయిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం అటవీ అధికారులు, పోలీసులు, నాయకులు గ్రామస్తులతో సమావేశమై భూముల కేటాయింపుపై సుదీర్ఘంగా చర్చించారు. అటవీశాఖ పరిధిలో ఉన్న భూముల్లో కొన్నేళ్లుగా గ్రామస్తులు పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. అయితే వీరందరూ గిరిజనేతరులు కావడంతో పట్టాలు మంజూరు కాలేదు. ఇటీవల గ్రామస్తులు సమస్య పరిష్కారం కోసం మంత్రి సీతక్కను కలిశారు. అటవీశాఖ ప్లాంటేషన్‌ పేరుతో తమ భూములు లాక్కుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఆదేశాలతో అధికారులు సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు. నెలరోజులుగా సర్వే ప్రక్రియ చేపడుతున్నారు. గ్రామస్తులు కోరిన విధంగా ఇటిక్యాల పహాడ్‌ గ్రామంలో నివాసం ఉంటూ పోడు వ్యవసాయం చేసుకునే పాత గ్రామస్తులు 150 మందికి నాలుగెకరాల చొప్పున.. అడ గ్రామం నుంచి వచ్చిన 40 కుటుంబాలకు రెండెకరాల చొప్పున భూములు కేటాయించాలని నిర్ణయించారు. ప్రస్తుతం కొలతలు పూర్తయ్యాయని, కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో ఇక్బాల్‌ హుస్సేన్‌, తహసీల్దార్‌ శ్రీనివాస్‌, కౌటాల సీఐ ముత్యం, ఎస్సై రమేశ్‌ పాల్గొన్నారు. కాగా.. గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించామని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌ తెలిపారు. శుక్రవారం ఆయన గ్రామస్తులతో మాట్లాడారు.

క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న కడియం శ్రీహరి



మనవరాలికి అక్షరాభ్యాస పూజ చేయిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

బాసర: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారిని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరం, ఎంపీ కావ్య శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అక్షరాభ్యాస మండపంలో శ్రీహరి మనవరాలికి అక్షరాభ్యాస పూజను ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌పాఠక్ జరిపించారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆశీర్వచన మండపంలో అర్చకులు వారిని ఆశీర్వదించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, బాసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మమ్మాయి రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీ రైతుల రుణాలు మాఫీ చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంత రైతుల రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు భరత్ చౌహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని టీజీబీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనేతర రైతులకు రుణమాఫీ చేయాలని, కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకూ రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో పాటు వివిధ కులాలవారు నివసిస్తున్నారని, ప్రభుత్వం గిరిజన, గిరిజనేతర రైతులకు పహణీలు ఇచ్చిందని తెలిపారు. వాటిని బ్యాంకుల్లో పెట్టి రైతులు రుణాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వీరి రుణాలు మాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన వృద్ధుడు తాళ్ల లక్ష్మణ్ (64) చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు, ఏఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్రవాహనంపై వెళ్తున్న తాళ్ల లక్ష్మణ్ బుధవారం రాత్రి గ్రామ సమీపంలో ఎడ్లబండిని తప్పించేక్రమంలో కిందపడ్డాడు. గాయపడ్డ అతడిని గమనించిన స్థానికులు చికిత్స కోసం భైంసాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నాందేడ్‌లోని ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య గంగామణి, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి..

లోకేశ్వరం: మండలంలోని నర్సింహనగర్ తండాకు చెందిన జాదవ్ మోహన్ (33) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. జాదవ్ మోహన్ ఏ పనీ చేయకుండా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 11న తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. మృతుడికి భార్య శోభాబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శోభాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కారును ఢీకొట్టిన లారీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కుమురంభీం చౌక్‌లో శుక్రవారం ఉదయం రిమ్స్ వైపు నుంచి గాంధీ పార్క్ వైపు వెళ్లే క్రమంలో వెనుక నుంచి లారీ కారును ఢీకొట్టింది. దీంతో కారు ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. కాగా, పట్టణంలోని తిరుమలనగర్‌కు చెందిన కారు యజమాని చంద గణేశ్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘హోమియో’పై చిన్నచూపు



మూతపడ్డ ఉట్నూర్‌లోని ప్రభుత్వ హోమియో ఔషధాలయం

- మూతపడ్డ ఉట్నూర్ ఔషధాలయం
- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది కేంద్రాలు
- ఒకే డాక్టర్, ముగ్గురే ఫార్మసిస్టులు
- సేవలందక ఇబ్బందుల్లో రోగులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణంలోని ప్రభుత్వ హోమియో ఔషధాలయం మూతపడింది. 20రోజుల క్రితం ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్, ఫార్మసిస్టులు బదిలీపై వెళ్లగా తిరిగి ఎవరినీ నియమించలేదు. ఈ ఔషధాలయానికి జన్నారం, కడెం, ఇంద్రవెల్లి, నార్నూర్, కెరమెరి, జైనూర్ మండలాల నుంచి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు వస్తుంటారు. వైద్యులు లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. హోమియో ఔషధాలయాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, వాతం, చర్మవ్యాధులు, కాలానుకుగుణంగా సంక్రమించే వ్యాధులు పూర్తిగా నయమయ్యేందుకు ఈ ఔషధాలు ఉపయోగపడతాయని హోమియో వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఒకే డాక్టర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎనిమిది హోమియో ఔషధాలయాలున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం ఉషేగాం, సిర్పూర్(టీ), ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని పొన్కల్, కడ్తాల్, దహెగాం, బాసరలలో ఈ ఔషధాలయాలున్నాయి. వీటిలో ఒకే డాక్టర్, ముగ్గురు ఫార్మసిస్టులు మాత్రమే పనిచేస్తున్నారు. మూడురోజులకోసారి ఒక్కో ఔషధాలయాన్ని ఉన్న సిబ్బందితో కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో డాక్టర్లు, ఫార్మసిస్ట్, సిబ్బంది నియమించి ఔషధాలయాలను కొనసాగించాలని దీర్ఘకాలిక రోగులు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



హోమియో ఔషధాలయాల్లో పూర్తి స్థాయిలో డాక్టర్లు, సిబ్బందిని నియమించాలి. దీర్ఘకాలిక రోగాలకు హోమియో వైద్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ వైద్యశాల ద్వారా మందులు అందించి ఆరోగ్య సమస్యల నుంచి తప్పించాలి.

– మొహమ్మద్ ముజీబ్, దంతన్‌పల్లి

అందుబాటులోకి తేవాలి



ఏజెన్సీ ప్రాంతంలో డాక్టర్, సిబ్బంది లేక ఉట్నూర్ హోమియో ఔషధాలయం మూతపడింది. ఆయా మండలాల నుంచి వచ్చే రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ కేంద్రం ద్వారా సేవలందించాలి.

– పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

సర్కారు భూమిలో ఇళ్ల నిర్మాణాలు



ప్రభుత్వ భూమిలో కడుతున్న షెడ్లు

- ఇందిరమ్మ ఇళ్ల కాలనీలో ఆరెకరాలకు పైగా కబ్జా
- ఇళ్లు, షెడ్ల నిర్మాణాలు
- ఆర్డీవో సర్వే చేయించి హద్దులు వేసినా ఆగని వైనం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. పట్టణ శివారు సర్వే నంబరు 170లోని ప్రభుత్వ భూమిలో ఇళ్లు, షెడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ఎల్లమ్మగుడి పక్కన ఉన్న ఇందిరమ్మ ఇళ్ల కాలనీ వెనుకాల ఉన్న సర్కారు భూమిలో రెండ్రోజులుగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. సరిగ్గా నెల రోజుల క్రితం ఆర్డీవో హరికృష్ణ ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా జేసీబీతో కందకం తవ్వించి కట్టడి చర్యలు చేపట్టారు. పడావుగా ఉన్న భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ హెచ్చరికలను బేఖాతార్ చేస్తూ అక్రమార్కులు పేదలను ప్రోత్సహించి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. సిమెంటు స్తంభాలు, కర్రలతో షెడ్లు నిర్మిస్తున్నారు. ఆరు ఎకరాలకు పైగా భూమి ఆక్రమించినట్లు తెలుస్తోంది. ఓ వ్యక్తి ఏకంగా నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సీఓఈ గురుకుల కళాశాల కోసం

బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములన్నీ కబ్జాకు గురయ్యాయి. ఎల్లమ్మగుడి ఇందిరమ్మ ఇళ్ల వెనుకాల ఉన్న భూమిని భవిష్యత్ అవసరాల కోసం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాలకు కేటాయించాలని పేరెంట్స్ కమిటీ రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేయగా.. సానుకూలంగా స్పందించారు. ఆర్డీవో సర్వే చేయించి హద్దులు కూడా ఏర్పాటు చేశారు. ఇంతలోనే ఆక్రమణకు గురి కావడం చర్చనీయాంశమైంది.

రాజకీయ అండదండలు..!

ఇందిరమ్మ ఇళ్ల కాలనీలో ఇప్పటికే అనేక అక్రమాలు జరిగాయి. ఓ మాజీ మండల ప్రజాప్రతినిధి, మరో మాజీ సర్పంచ్ కొందరు దళారులను ఏర్పాటు చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల క్రయ విక్రయాలు సాగించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఖాళీగా ఉన్న భూమికి రూ.లక్షల్లో ధర నిర్ణయించి రియల్ దందా సాగించారు. ప్రస్తుతం మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం వెనుక ఓ ప్రధాన రాజకీయ పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. కబ్జాదారులకు అండగా ఉండి సర్కారు భూమిలో షెడ్ల నిర్మాణాలు చేయిస్తున్నారని చర్చించుకుంటున్నారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీ నాయకులు కబ్జా చేయగా.. ప్రస్తుతం ఓ ముఖ్య రాజకీయ పార్టీ నాయకులు కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికారులు కబ్జాదారులపై చర్యలు తీసుకుని అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

స్వాధీనం చేసుకుంటాం



ఇందిరమ్మ ఇళ్ల కాలనీ వెనుకాల ఉన్న ఉన్న ప్రభుత్వ భూమిని ప్రభుత్వ అవసరాలకు కేటాయించాలని అనుకున్నాం. ఆ భూమిని అక్రమార్కులు కబ్జా చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఇప్పటికే ఎన్నోమార్లు హెచ్చరించినా కొందరు భూకబ్జాలు మానడం లేదు. సర్కారు భూమిలో కట్టిన ఇళ్లను కూల్చివేసి తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ఇందుకు కార్యాచరణను త్వరలోనే చేపడతాం.

– కే.వై.ప్రసాద్, తహసీల్దార్, బెల్లంపల్లి

మృతదేహానికి రీపోస్టుమార్టం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని బురదగూడ గ్రామానికి చెందిన కొ్ట్రంగి సాంబయ్య అలియాస్ శ్యాంరావు మృతదేహానికి శుక్రవారం అధికారులు రీపోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు.. మంచం పైనుంచి కిందపడి గాయాలపాలై ఈనెల 3న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సాంబయ్య తల్లి భీంబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్సై సోనియా కేసు నమోదు చేశారు. అయితే మృతిపై పలు అనుమానాలున్నాయని కొంతమంది గ్రామస్తులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్డీవో సురేశ్ సమక్షంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై మహేందర్ సిబ్బందితో మృతదేహాన్ని వెలికితీశారు. మంచిర్యాల మెడికల్ కళాశాలకు చెందిన ఇద్దరు ఫోరెన్సిక్ నిపుణులు మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించారు. ఈ ప్రక్రియను కుటుంబీకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. అనంతరం డీఎస్పీ కరుణాకర్ మాట్లాడుతూ.. సాంబయ్య మృతిపై పలు అనుమానాలు ఉండటంతో రీపోస్టుమార్టం చేశామని తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణులు ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది

ప్రమాదస్థలిని సందర్శించిన రోడ్డు భద్రత కమిటీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో ఈ నెల 14వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని రోడ్డు భద్రత కమిటీ శుక్రవారం సందర్శించింది. హాజీపూర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు చిప్పకుర్తి పోశమ్మ (68) మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు కావడంతో రోడ్డు భద్రత కమిటీలోని సభ్యులైన మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, ఎంవీఐ కిశోర్‌చంద్రారెడ్డి, హాజీపూర్ ఎస్సై సురేశ్ ప్రమాదస్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతంలో భద్రత ఏర్పాట్లలో భాగంగా బారికేడ్లు ఏర్పాటు చేయించారు. ఇక మండలంలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలనూ త్వరలోనే పూర్తి స్థాయిలో పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులు తెలిపారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూ

సాక్షి స్పందన

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నాలుగు ప్రత్యేక వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించడం కోసం ఈ నెల 23న కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ ఉపేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 29న ‘సాక్షి’లో ప్రచురితమైన ‘పేరుకే జిల్లా ఆసుపత్రి’ కథనానికి స్పందించిన కలెక్టర్ వైద్య పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఖాళీగా ఉన్న జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్ సర్జన్, ఎనిస్తీషియా, పల్మనాలజీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులు దరఖాస్తులను ఆదిలాబాద్‌లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849878635, 9490024909 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న రవి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి ఎస్.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏరియా ఆసుపత్రి సందర్శనకు వచ్చిన కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీనెల కార్మికులకు వేతనాలు చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఈ కారణంగా కార్మికులు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి సక్రమంగా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ కార్మికులున్నారు.

కైరిగూడ మేనేజర్‌గా శంకర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శంకర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ నూతన మేనేజర్‌గా జె.శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం ఏరి యా నుంచి కైరిగూడ ఓసీపీకి మేనేజర్‌గా బదిలీపై వచ్చిన ఆయన గత మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. నూతన మేనేజర్‌ను యూనియన్ నాయకులు, గని అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ రూ.27వేల కోట్లు వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఈ బకాయిలు పెరుగుతూ వచ్చాయని తెలిపారు. సింగరేణి సొమ్మును ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించకుండా కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు. కార్మికులందరికీ రెండు గుంటల ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇప్పించాలని కోరారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని, నూతన బొగ్గు బావులను ఏర్పాటు చేయాలన్నారు. కంపెనీ గత సంవత్సరం సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి అందులోంచి కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాలకు చెందిన సుమారు 20 మంది యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు బద్రి బుచ్చయ్య, మారుపెల్లి బాబు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, గునిగంటి నరసింగరావు, పిట్ సహాయ కార్యదర్శి నల్ల సత్తయ్య, నాయకులు మోహన్‌రెడ్డి, ఆళ్ల వెంకటరెడ్డి, శంకర్, బానోత్ సరోజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీ సీతారామయ్య

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్ లోగల నీలం బ్రదర్స్ రైస్‌మిల్లులో 25 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ పోచయ్య, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీలం బ్రదర్స్ రైస్‌మిల్లుకు శుక్రవారం తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో 25 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ వాహనంలో వస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మిల్లు వద్ద పహారా కాశారు. అక్కడికి వచ్చిన 25 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను మిల్లు నిర్వాహకులు కొనుగోలు చేయగా పట్టుకున్నారు. అనంతరం సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో కాసిపేటకు చెందిన మొగిలి ద్వారా మిల్లు నిర్వాహకులు బియ్యం కొనుగోలు చేసినట్లు తెలిసింది. అనంతరం వారిపై కేసు నమోదు చేశారు. పట్టుకున్న రైస్ విలువ రూ.94,845 ఉంటుందని డీటీ, ఎస్సై తెలిపారు. మిల్లు సీజ్ చేసి తదుపరి విచారణ కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు వివరించారు.



పట్టుకున్న బియ్యాన్ని పరిశీలిస్తున్న డీటీ, ఎస్సై

లారీ బోల్తా

వాంకిడి: మహారాష్ట్ర వైపు నుంచి ఇనుప కడ్డీల లోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన శుక్రవారం వాంకిడి మండలంలోని నాలుగు వరుసల జాతీయ రహదారి–363పై గోయేగా గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 6 గంటలకు మహారాష్ట్ర వైపు నుంచి వాంకిడి వైపునకు ఇనుప కడ్డీల లోడుతో లారీ వస్తుండగా రహదారిపై ఉన్న భారీ గుంతను డ్రైవర్ గమనించలేదు. గోయేగాం సమీపంలో ఫోర్‌లేన్‌పై ఉన్న గుంతను తప్పించే క్రమంలో లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెనుకనుంచి మరే ఇతర వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.



బోల్తా పడ్డ లారీ

రైలు నుంచి పడి ఒకరికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో హైదరాబాద్ నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందపడటంతో చంద్రాపూర్‌కు చెందిన ప్రశాంత్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన రైల్వేపోలీసులు అతడిని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యాన్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

కోటపల్లి: మండలంలోని మల్లంపేట, నాగంపేట వెళ్లే దారిలో రోడ్డు వరద కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం మల్లంపేట నుంచి నాగంపేటకు వెళ్తున్న వ్యాన్ మార్గంమధ్యలో ప్రమాదకరంగా కోతకు గురైన రోడ్డుపై బోల్తా పడింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అటవీ అనుమతులు లేక రోడ్డు నిర్మాణం నిలిచిపోగా చెన్నూర్ నుంచి బోప్పారం వరకు నడిచే ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను నిలిపివేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోప్పారం, నాగంపేట గ్రామాల ప్రజలకు కొండంపేట శివారులో వ్యవసాయ భూములు ఉన్నాయి. వీరు ఎరువులు, ధాన్యంతో ఇదే రహదారిపై నుంచి వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయించాలని కోరుతున్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి



కెరమెరి: ఘటనాస్థలిలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై

కెరమెరి: మండల కేంద్రంలోని బారేవాడకు చెందిన చౌదరి రమేశ్ (30) పిడుగుపాటుతో మృతి చెందాడు. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్‌కు చెందిన పొలంలో చౌదరి రమేశ్ శుక్రవారం వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో పిడుగుపడింది. దీంతో రమేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుమిత్ర, ఇద్దరు కుమారులున్నారు. సుమిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలంలోని నందుప గ్రామానికి చెందిన గాత్రే అంజన్న (20) రోజులాగే శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్లి వస్తున్న క్రమంలో మార్గంమధ్యలో పిడుగు పాటుకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంజన్నను కాగజ్‌నగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు గౌరయ్య–విమలాబాయి దంపతుల కుమారుడు కాగా, ఇతడికి ముగ్గురు అక్కాచెల్లెళ్లున్నారు. ఎదగిన వయస్సులో అంజన్న మృతి చెందడంతో వారంతా బోరున విలపించారు.



అంజన్న (ఫైల్)

కలెక్టర్ వాహనం ఎదుట ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తిస్థాయి రెగ్యులర్ వైద్యులను నియమించాలని, హస్నాపూర్ చౌరస్తా నుంచి ఎల్లాపూర్ వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ రాజర్షి షా వాహనం ఎదుట బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. నినాదాలతో హోరెత్తించారు. ఆందోళన చేస్తున్న వారి వద్దకు కలెక్టర్ వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, చిన్న సమస్య వచ్చినా ఉట్నూర్ లేదా ఆదిలాబాద్‌కు రెఫర్ చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రెగ్యులర్ వైద్యులను నియమించాలని కోరారు. హస్నాపూర్ చౌరస్తా నుంచి గాదిగూడ ఎల్లాపూర్ వరకు సరైన రోడ్డు లేక తరచూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని కలెక్టర్‌కు తెలిపారు. హస్నాపూర్ చౌరస్తా నుంచి గాదిగూడ ఎల్లాపూర్ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. వారం రోజుల్లో ఇద్దరు వైద్యులను డిప్యూటేషన్‌పై నియమిస్తామని, త్వరలో రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు. పార్టీ జిల్లా నాయకుడు భీక్షపతి రాథోడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చాలుకర్ ప్రకాశ్, మండలాధ్యక్షుడు తొడసం బండు, పేసా చట్టం కోఆర్డినేటర్ రాథోడ్ సికిందర్, తాజా మాజీ ఉపసర్పంచ్ చౌహాన్ మహేందర్ తదితరులున్నారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

తలమడుగు: పురుగుల మందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అంగ లక్ష్మి (67) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. వృద్ధాప్యానికి అనారోగ్యం తోడు కావడంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. లక్ష్మి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గోపాల్ తెలిపారు.